క్లుప్తంగా

అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలందుకున్న అయ్యప్ప మూలవిరాట్

బత్తలపల్లి: స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురుస్వామి శెట్టిప్పస్వామి ఆధ్వర్యంలో గణపతి పూజ, అయ్యప్ప పూజ, అమ్మవార్లకు ప్రత్యేక పూజలను చేపట్టారు. ముళ్లగూరు సతీష్‌కుమార్, శ్రీలక్ష్మీ దంపతుల తనయుడు ముళ్లగూరు పూర్ణచంద్ర జన్మదినం సందర్భంగా మధ్యాహ్నం అయ్యప్ప మాలధారులకు భిక్ష ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అయ్యప్ప సేవా సంఘం సభ్యులు జక్కంపూటి పురుషోత్తంచౌదరి మాట్లాడుతూ డిసెంబర్ మొదటి వారం నుంచి ఆలయంలో మధ్యాహ్నం భిక్ష కొనసాగుతోందన్నారు. అయ్యప్ప సేవా సంఘం కమిటీ సభ్యులు వడ్డె బొజ్జప్ప, గోగుల కాటమయ్య, అక్కిం ప్రతాప్, బోయపాటి అప్పస్వామి, జొన్నలగడ్డ రంగా నాయుడు, బొమ్మినేని రాము, తొట్లు వేణు, కుమ్మర శివయ్య, ఫోటో స్టుడియో మహేష్, వక్కల శ్రీనివాసులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితుడికి చేయూత



క్యాన్సర్ బాధితుడికి ఆర్థికసాయం అందిస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: క్యాన్సర్‌తో బాధపడుతున్న వ్యక్తికి మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు ఆర్థిక చేయూతనందించారు. పట్టణంలోని కేతిరెడ్డి కాలనీలో నివసిస్తున్న కానాల హరీష్ క్యాన్సర్‌తో మంచానికే పరిమితమయ్యాడు. చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులతో అవస్థలు పడుతున్న విషయం తెలుసుకున్న మానవతా స్వచ్ఛంధ సేవా సంస్థ వైస్ ప్రెసిడెంట్ జగ్గా వేణుగోపాల్ మానవతా సభ్యులతో విరాళాలు సేకరించి ఆదివారం బాధితుడి ఇంటికి వెళ్లి రూ.35 వేలు నగదు అందించారు. కార్యక్రమంలో మానవతా సంస్థ చైర్మన్ తల్లం నారాయణమూర్తి, కార్యదర్శి మంజునాథ్, డైరెక్టర్లు సాయిప్రసాద్, రామకృష్ణ, సభ్యుడు రవి తదితరులు పాల్గొన్నారు.

జేసీబీ స్వాధీనం



పోలీసుల అదుపులో ఉన్న జేసీబీ

బత్తలపల్లి: చిత్రావతి నదిలో ఇసుకను అక్రమంగా తరలించేందుకు ఏర్పాటు చేసుకున్న జేసీబీని పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. రామాపురం గ్రామం సమీపంలోని చిత్రావతి నదిలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న రెవెన్యూ సిబ్బంది, పోలీసులు కలిసి జరిపిన దాడుల్లో లోడ్ చేసేందుకు సిద్ధంగా ఉన్న జేసీబీని స్వాధీనం చేసుకున్నారు. బత్తలపల్లి తహసీల్దార్ స్వర్ణలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. తహసీల్దార్ స్వర్ణలత, దంపెట్ల వీఆర్‌ఓ నరసింహులు, ఓబుళాపురం వీఆర్‌ఓ రాజశేఖర్, హెడ్ కానిస్టేబుల్ శ్రీరాములు పాల్గొన్నారు.

నేడు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

బత్తలపల్లి: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ స్వర్ణలత ఆదివారం తెలిపారు. అన్ని శాఖల అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారన్నారు. మండలస్థాయిలో జరిగే కార్యక్రమానికి మండలస్థాయి అధికారులందరూ హాజరు కావాలని సూచించారు. ప్రజలు కూడా ఏవైనా సమస్యలుంటే వినతిపత్రాలను అందజేయవచ్చన్నారు.

స్వెటర్లు, భోజనం పంపిణీ



స్వెటర్లు అందజేస్తున్న రవీంద్రారెడ్డి దంపతులు

కదిరి అర్బన్: మొటుకుపల్లి ఆర్డీటీ కేంద్రంలోని దివ్యాంగ పాఠశాల విద్యార్థులకు ఆదివారం ఉపాధ్యాయుడు రవీంద్రారెడ్డి భారతి దంపతులు స్వెటర్లు, భోజనం అందజేశారు. సామాజిక బాధ్యతలో భాగంగా తమ వంతు సాయం అందజేసినట్లు వారు తెలిపారు. చిన్నారులు చలికి తీవ్ర ఇబ్బందులు పడకుండా స్వెటర్లు పంపిణీ చేశామన్నారు.

అన్నదాతలకు దక్కని భరోసా!

- ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని హామీ
- రబీ ప్రారంభమైనా పెట్టుబడి సాయం ఊసెత్తని ప్రభుత్వం
- ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూస్తున్న రైతులు



చిగిచెర్ల వద్ద వేరుశనగ పంట సాగు చేస్తున్న రైతులు

ధర్మవరం రూరల్: కూటమి ప్రభుత్వంలో రైతన్నకు సాగు ఇబ్బందులు తప్పడం లేదు. ఖరీఫ్ సాగులో పెట్టుబడి సాయం అందుతుందని ఎదురు చూసిన వారికి నిరాశే మిగిలింది. కనీసం రబీ సీజన్‌లో సాగుకైనా ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేలు అందుతుందని ఎంతో ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన రైతు భరోసా పేరును ప్రస్తుత ప్రభుత్వం అన్నదాత సుఖీభవగా పేరు మార్చిందే తప్ప పెట్టుబడి సాయాన్ని మరిచిపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకానికి సంబంధించి తొలి విడత సాయంగా రూ.2 వేలను రైతుల ఖాతాల్లోజమ చేసింది. అన్నదాత సుఖీభవ కింద రాష్ట్ర ప్రభుత్వం అందించాల్సిన పెట్టుబడి సాయం గురించి ఎటువంటి స్పష్టత లేకపోవడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

రబీ సాగుకు పెట్టుబడులు ఎలా?

ఖరీఫ్‌లో వేరుశనగ పంట చేతికి అందకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. మరో పక్క కంది పంట అయినా చేతికందుతుందని ఆశించినా నిరాశే మిగులుతోంది. వరుసగా అల్పపీడనాలు రావడంతో ఆకాశం మేఘావృతమై కంది పూత రాలిపోతోందంటు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బోరు బావుల్లో నీళ్ల ఉన్న రైతులు వేరుశనగ పంటను సాగు చేయడానికి సిద్ధపడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో విత్తనాలు, ఎరువులు, ట్రాక్టర్ బాడుగలకు అప్పులు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి సమయంలోనైనా అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం అందించాలని రైతులు కోరుతున్నారు.

జగన్ ప్రభుత్వంలో సకాలంలో పెట్టుబడి సాయం

గత ప్రభుత్వంలో సకాలంలో రైతు భరోసా పథకం కింద రైతులకు పెట్టుబడి సాయం అందేదని రైతులు అంటున్నారు. పీఎం కిసాన్ సాయంగా రూ 6వేలు,రైతు భరోసా పథకం కింద రూ.7,500 కలిపి ఏటా రూ.13,500లను విడతల వారీగా ఖాతాలకు జమ చేసిందని గుర్తు చేసుకుంటున్నారు.

ఇప్పుడా పరిస్థితి లేకపోవడంతో మళ్లీ కష్టాలు మొదలయ్యాయని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా రబీ సీజన్‌లో రైతులకు ప్రభుత్వం పెట్టుబడి సాయం అందిస్తే బాగుంటుందని, ఇకనైనా అన్నదాత సుఖీభవ పథకంపై స్పష్టత ఇవ్వాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

ధర్మవరం నియోజకవర్గంలో రబీ సాధారణ సాగు విస్తీర్ణం(ఎకరాల్లో)	
మండలం	సాధారణ విస్తీర్ణం
ధర్మవరం	3,160
బత్తలపల్లి	2,700
తాడిమర్రి	2,000
ముదిగుబ్బ	5,150

పెట్టుబడి సాయం అందించాలి



కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో చెప్పిన విధంగా అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేలను రైతుల ఖాతాల్లోకి జమ చేయాలి. రబీలో చాలా మంది బోరు బావుల కింద వేరుశనగ, ఇతర పంటలను సాగు చేసుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం స్పందించి పెట్టుబడి సాయాన్ని అందిస్తే ఉపయోగపడుతుంది.

– రమేష్, రైతు, ఏలుకుంట్ల

కంది సాగుతో నష్టం



నేను 5 ఎకరాల్లో కంది పంటను సాగు చేశాను. వాతావరణంలో మార్పులు కారణంగా కంది పంటలో పూత నిలబడడం లేదు. కంది పంట సాగు కోసం ఇతరుల వద్ద అప్పులు చేశాను. ప్రభుత్వం ఇస్తుందనుకున్న పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇస్తే కాస్త ఉపశమనంగా ఉంటుంది.

– మాధవయ్య, రైతు, చిగిచెర్ల

'ఆర్డీఓ న్యాయం చేస్తామని చెప్పారు'

గాండ్లపెంట: కదిరి ఆర్డీఓ వీవీఎస్ శర్మ తమ కుటుంబానికి న్యాయం చేస్తామని చెప్పారని కటారుపల్లికి చెందిన హరిజన ఓబులేసు, వెంకటరమణ ఆదివారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ తాతకు ఇచ్చిన భూమి తమ కుటుంబానికి ఇవ్వాలని ఆర్డీఓను కోరగా 1978లో సర్వేనంబరు 1482 లో 2.41 ఎకరాలు ఇచ్చిన సాగు పట్టా భూమి నిషేధిత భూమి వాగు పరంబోకు కావడంతో ఇవ్వడం కుదరదని తెలిపారన్నారు. అదే సమయంలో వేరే చోట అనువైన స్థలాన్ని గుర్తించి మంజూరు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారులు తమకు న్యాయం చేయాలని లేని పక్షంలో కుటుంబ సభ్యులచే తిరిగి దీక్ష చేపడతామని తెలిపారు.

సాయి ప్రూడెంట్ టెస్ట్‌కు స్పందన



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి సమీపంలోని సంస్కృతీ విద్యాసంస్థల్లో ఉచిత బీటెక్, బీబీఏ విద్య కోసం నిర్వహించిన సాయి ప్రూడెంట్ టెస్ట్‌కు అనూహ్య స్పందన లభించింది. ఈ పరీక్షలో అర్హత సాధించిన వారికి కోర్సు పూర్తయ్యే వరకూ ఉచిత విద్యను అందించనున్నారు. ఇది అనహత స్టఫ్టింగ్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించిన పరీక్షకు సుమారు 3271 మంది హాజరైనట్లు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ హరికృష్ణన్ ప్రకటించారు. ఉత్తీర్ణులైన వారికి ఇంటర్వ్యూలు నిర్వహించి అడ్మిషన్స్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కళాశాలకు ఈ సంవత్సరం నాక్ ఏ గ్రేడ్ రావడం చాలా సంతోషంగా ఉందని చైర్మన్ విజయ్‌భాస్కర్‌రెడ్డి చెప్పారు.

వినియోగదారుల వారోత్సవాలు జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు సురేష్ కుమార్

పుట్టపర్తి టౌన్: ఈనెల 18 నుంచి 24 వరకు వినియోగదారుల సంఘాల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా తలపెట్టిన జాతీయ వినియోదారుల వారోత్సవాలను జయప్రదం చేయాలని జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్షుడు సురేష్ కుమార్, జిల్లా ఆహార భద్రత అధికారి గణేష్ కోరారు. ఆదివారం పట్టణంలోని సాయి ఆరామంలో జిల్లా వినియోగదారుల సంఘాల సభ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోదారుల సంఘాలు పటిష్టంగా ఉన్నప్పుడే వినియోగదారులకు సరైన సేవలు అందుతాయన్నారు. గ్రామస్థాయిలో వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతి మండలంలో వినియోగదారుల సంఘాల ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. వారోత్సవాల్లో భాగంగా పాఠశాల, కళాశాలల్లో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వినియోగదారుల సంఘాల సమాఖ్యజిల్లా కార్యదర్శి వెంకటలక్ష్మి, సభ్యులు నారాయణమ్మ, వెంకటరమణప్ప, చలపతి, కుళ్ళాయప్ప, వెంకటేష్, అశుబి,శ్రీరామ్, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



ఉపాధ్యాయుని మృతికి సంతాపం వ్యక్తం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

ధర్మవరం అర్బన్: రాయచోటిలోని కొత్తపల్లి ఉర్దూ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు ఇజాజ్ అహమ్మద్ మరణానికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం ఉపాధ్యాయుని మృతికి సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 42 ఏళ్లున్న ఇజాజ్ అహమ్మద్ 20 ఏళ్ల సర్వీసు ఉండగానే ఇలా దురదృష్టకరంగా మృతి చెందడం వారి కుటుంబానికి తీరని నష్టమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వారి కుటుంబానికి నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే పాఠశాలలో నైతిక విలువలు పెంపొందే చర్యలు అధికారికంగా చేపట్టే విధంగా మేధావులు, ఉపాధ్యాయ సంఘాలు, ప్రజా సంఘాలతో చర్చించి చర్యలు తీసుకోవాలని కోరారు. పాఠశాలలో జరిగిన సంఘటనపై సమగ్ర విచారణ చేసి బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ నాయకులు హనుమంతరావు, రామకృష్ణనాయక్, లక్ష్మయ్య, అమర్‌నారాయణరెడ్డి, సకల చంద్రశేఖర్, పెద్దకోట్ల సురేష్, సాయిగణేష్, హెచ్. రామంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై డ్రోన్‌తో నిఘా



డ్రోన్‌ను ఎగరేస్తున్న పోలీస్ అధికారులు

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం వంటి వాటిపై పోలీసులు డ్రోన్‌తో నిఘా పెట్టారు. ఆదివారం పుట్టపర్తి మండలంలోని కంబాలపర్తి, బొంతలపల్లి , అమగొండపాళ్యం అటవీ ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాతో పలు ప్రదేశాలను జల్లెడ పట్టారు. ఎక్కడైనా గంజాయి సాగు చేస్తున్నా, దుండగులు సంచరిస్తున్నా, ఏవైన ప్రమాదకర జంతువులు సంచరిస్తున్నా ఇట్టే పట్టేసేలా చర్యలు చేపట్టారు. బహిరంగ ప్రదేశాల్లో పేకాట, ఈవ్ టీజింగ్, చైన్ స్నాచింగ్ చేసినా వెంటనే పోలీసులకు సమాచారం అందిస్తే డ్రోన్ కెమెరాతో నిందితులను పట్టుకునేలా సిబ్బందిని, డ్రోన్ కెమెరాలను సిద్ధం చేశామని ఎస్పీ రత్న చెప్పారు.

ఇస్కాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలందుకున్న దేవతా మూర్తులు

ధర్మవరం రూరల్: స్థానిక శారదానగర్‌లోని ఇస్కాన్ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మూల విరాట్ విగ్రహాలైన శ్రీ కృష్ణుడు, బలరాముడు, సుభద్రలకు ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేసినట్లు ఆలయ ఇన్‌చార్జ్ శ్రీ కృష్ణ మాధవదాస్ తెలిపారు. భాగవత కథ, హరే రామ భజనలు భక్తాదులను మైమరపించాయి. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో శంకర్‌నాథ్, హరి ప్రసాద్, శ్యాంసుందర్, పార్థసారతి, సుభాంగం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమణ



వీవర్స్ కాలనీలో రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్‌స్తంభం

నల్లచెరువు: మండల కేంద్రంలోని వీవర్స్ కాలనీలో రోడ్డుకి ఇరువైపులా కొందరు రోడ్డు స్థలం దాదాపు ఏడు అడుగులు ఆక్రమించుకొని ఇళ్ల నిర్మించుకున్నారు. దీంతో రహదారిలో వర్షం నీరు నిలిచి కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికితోడు రోడ్డుకు మధ్యలో విద్యుత్ స్తంభాలు ఉండడంతో కాలనీలోకి అత్యవసర వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి ఉందని కాలనీవాసులు వాపోతున్నారు. ఆక్రమణపై ప్రశ్నిస్తే తమకు అధికార పార్టీ నాయకుల అండ ఉందంటూ కొందరు బెదిరిస్తున్నారని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించి రోడ్డు సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

కోడి పందెంరాయుళ్ల అరెస్ట్

ముదిగుబ్బ: టీఎస్ పాళ్యం గ్రామ శివారులో ఆదివారంకోడి పందెలు ఆడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు పట్నం ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు. ఈసందర్భంగా రెండు కోళ్లు, నాలుగు ద్విచక్ర వాహనాలతో పాటు రూ.3060ను స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఉత్తమ అవార్డు గ్రహీతకు సన్మానం

కదిరి అర్బన్: స్థానిక ఎన్జీఓ హోంలో డాక్టర్ కరీం రుమానీ ఎడ్యుకేషనల్, చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఇర్ఫాన్ కౌసర్‌కు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పీహెచ్‌డీ పట్టా పొందిన ఇర్ఫాన్ కౌసర్, జంషీద్‌బేగం , ఫైజుల్లా తదితరులను సన్మానించారు. ఉర్దూ యూనివర్సిటీ(కర్నూలు) మాజీ వీసీ డా. అబ్దుల్ హక్, ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ కరీం రుమాని, ఉపాధ్యాయులు హరిప్రసాద్‌రెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అధికారులకు సన్మానం



సీఐను సన్మానిస్తున్న ముస్లిం సంక్షేమ సంఘం నాయకులు

ముదిగుబ్బ: స్థానిక యూపీఎస్ పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వచ్చిన సీఐ శివరాముడు, ఎస్‌ఐ ఇసాక్ బాషాను ఆదివారం ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడే ఖలందర్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు పోలీసులు సమాజ రక్షకులన్నారు. పోలీసులు సమాజ రక్షణ కోసం తమ వ్యక్తిగత జీవితాలను సైతం త్యాగం చేస్తున్నారన్నారు. సంఘం నాయకులు చింతపండు హైదర్‌వలి, జామియా మసీదు ముతవల్లి వలీసాబ్, సరితాల షబ్బీర్, రాళ్లపల్లి బాబు సాహెబ్, బేకరి చాంద్‌బాషా, ఏనుగుల అల్లా బకాష్, కుతుబుద్దీన్, షబ్బీర్, ముస్తాక్, ఇర్ఫాన్,యాసీన్, మైను, ముబారక్ తదితరులు పాల్గొన్నారు.

హిందూ శంఖారావం మహాసభకు తరలిరండి

ఎన్‌పీకుంట: వచ్చేనెల 5న విజయవాడలో జరిగే హిందూశంఖారావం మహాసభకు అధిక సంఖ్యలో హిందువులు తరలిరావాలని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రముఖ్ సుధాకర్, వీహెచ్‌పీ మండల ఇన్‌చార్జ్ గోపాలక్రిష్ణ కోరారు. తిమ్మమ్మమర్రిమాను వద్ద ఆదివారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో హిందూ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందువులంతా ఐక్యంగా ఉండి ఆలయాల్లో నిత్యం పూజలు జరిగేలా చూడాలని తెలిపారు. హిందూ ఆలయాలపై పెత్తనం చలాయిస్తున్న దేవదాయ శాఖ నుంచి తమ ఆలయాలను తామే సంరక్షించుకునేలా చట్టం తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆంజినప్ప, వీహెచ్‌పీ మండల కన్వీనర్ జయరాములు తదితరులు పాల్గొన్నారు.

కంటి శస్త్ర చికిత్సతో పేదలకు చూపు



వైద్యులను సన్మానిస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

ధర్మవరం అర్బన్: ఉచితంగా కంటి శస్త్ర చికిత్సతో పేదలకు చూపును అందిస్తున్నామని రోటరీక్లబ్ అధ్యక్షుడు జయసింహ తెలిపారు. పట్టణంలోని కోట మున్సిపల్ ప్రైమరీ పాఠశాలలో ఆదివారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ దాత దాసరి కేశమ్మ, దాసరి పెద్ద వెంకటేషులు జ్ఞాపకార్థం కుమారుడు దాసరి వెంకటేషులు, కోడలు రమాదేవి కుటుంబ సభ్యుల సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించామన్నారు. శిబిరంలో 134మందికి కంటి పరీక్షలు చేయగా 82 మంది కంటి శస్త్ర చికిత్సలకు ఎంపికయ్యారని తెలిపారు. బెంగళూరులోని శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు శస్త్ర చికిత్సకు ఎంపికైనవారికి ఆపరేషన్లు చేస్తారన్నారు. ఈనెల 17న ఉరవకొండ, బెళుగుప్పలలో ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించనున్నామని తెలిపారు. అనంతరం వైద్యులు, దాతలను శాలువాలతో సత్కరించారు. రోటరీక్లబ్ ఉపాధ్యక్షుడు నరేంద్రరెడ్డి, సభ్యులు సత్రసాల ప్రసన్నకుమార్, సోలిగాళ్ల వెంకటేషులు, శ్రీనివాసరెడ్డి, హరినాథ్, శివయ్య, రత్నశేఖర్‌రెడ్డి, సుదర్శన్‌గుప్త, కొండయ్య, రమేష్‌బాబు, రామకృష్ణ, శ్రీనివాస్, అంబికా, శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు.


ఇస్తెమా విజయవంతం చేయండి



ఇస్తెమా నిర్వహణపై చర్చిస్తున్న ముస్లిం మతపెద్దలు

తాడిమర్రి: మండల కేంద్రంలో వచ్చేనెల 19, 20 తేదీల్లో నిర్వహించనున్న ఇస్తెమాను జయప్రదం చేయాలని ముస్లిం మతపెద్దలు పిలుపు నిచ్చారు. ధర్మవరం, కదిరి పట్టణాలకు చెందిన పలువురు మత పెద్దల ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక తూర్పు చెరువు సమీపంలో ముస్లింలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చేనెల 19, 20 తేదీల్లో ధర్మవరం, కదిరి నియోజక వర్గాల పరిధిలోని ముస్లింలకు ఇస్తెమా నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా సమావేశానికి కావలసిన స్థలం, వాహనాల నిలుపుదలకు కావలసిన స్థలాలను చదును చేయాలన్నారు. ఇస్తేమాకు వచ్చే వారికి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక వసతులు కల్పించాలని నిర్వాహకులకు సూచించారు.

తాగునీరు లీకేజీ



రెడ్డిపల్లిలోని పాముదుర్తి రోడ్డులో ప్రవహిస్తున్న నీరు

నల్లమాడ: మండలంలోని రెడ్డిపల్లిలో పాముదుర్తికి వెళ్లే రహదారిపై తాగునీరు ప్రవహిస్తోంది. సత్యసాయి తాగునీటి పథకం పైప్‌లైన్ పలుచోట్ల దెబ్బతిని రక్షిత తాగునీరు లీకేజీ అయి నిత్యం రోడ్డుపై ప్రవహిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. ఫలితంగా రోడ్డు పొడవునా చిత్తడి చిత్తడిగా మారి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామన్నారు. పలుచోట్ల గుంతల్లో నీరు నిలిచిపోవడంతో దోమలు అధికమై రోగాల బారిన పడుతున్నామని తెలిపారు. రెండు నెలలుగా తాగునీరు లీకేజీ అయి వృథా అవుతున్నా సంబంధిత అధికారులు, సిబ్బంది ఏమాత్రం పట్టించుకోలేదని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ప్రభుత్వ భూముల జోలికి వస్తే ఎవరినీ వదలం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి టౌన్: కదిరి నియోజవర్గంలో ప్రభుత్వ భూముల జోలికి వస్తే ఎంతటి వారినైనా వదిలే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ హెచ్చరించారు. ఆదివారం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో కమిషనర్ కిరణ్‌కుమార్ అధ్యక్షతన రియల్ ఎస్టేట్ వ్యాపారులు, డాక్యుమెంట్ రైటర్లు, దళారులు, ఉపాధ్యాయులు, న్యాయవాదులకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వెంచర్ వేసేటపుడు మున్సిపల్ అప్రూవల్ తప్పక తీసుకోవాలన్నారు. అవినీతి, అక్రమాలకు పాల్పడితే తమ పార్టీ వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారథి, ఆర్డీఓ వెంకట సన్యాసి శర్మ, తహసీల్దార్ మురళీకృష్ణ, ఎంపీడీఓ పోలప్ప, సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాసులు, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తకు తీవ్రగాయాలు

కదిరి టౌన్: పట్టణంలోని బాలికల పాఠశాల సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అంగన్‌వాడీ కార్యకర్తకు తీవ్రగాయాలయ్యాయి. వివరాలు.. గాండ్లపెంట మండలం కొత్తపల్లికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త రమణమ్మ బాలికల పాఠశాల వద్ద నుంచి అడపాలవీధికి వెళుతున్న సమయంలో వేమారెడ్డి సర్కిల్ నుంచి బైక్‌పై వచ్చిన ముగ్గురు యువకులు ఆమెను ఢీకొన్నారు. ఘటనలో ఆమెకు తీవ్రంగా గాయపడటంతో వెంటనే స్థానికులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. యువకులపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధితురాలి బంధువులు తెలియజేశారు.

విద్యుత్ చార్జీల భారం తగ్గించండి

పెనుకొండ: ప్రభుత్వం ప్రజలపై మోపుతున్న ట్రూ ఆఫ్ చార్జీల భారాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆదివారం ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి సీపీఎం హరి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుత్ వినియోగదారులపై మోపిన రూ.15,441 కోట్ల ట్రూఅప్ యార్జీల భారాన్ని ఉపసంహరించుకోవాలని సీపీఐ శ్రీరాములు, బాబావలి, గంగాధర్, నాగరాజు పాల్గొన్నారు.